





అతిరథ మహారథుడై..

- వైభవంగా ఆదిదంపతుల రథోత్సవం
- కిటకిటలాడిన కెనాల్ రోడ్డు పరిసరాలు

నందీశ్వరుడు ఆనందతాండవమై నర్తించగా, బేతాళులు ప్రమద గణాలై దారి చూపగా, పాంచజన్యాలు ప్రణవనాదాలు పూరించగా రుద్రుడు రథారూఢుడై కదిలాడు. మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం కెనాల్ రోడ్డులో గంగా సమేత దుర్గామల్లేశ్వరుల రథోత్సవం వైభవంగా జరిగింది. 6లో



పట్టబద్ధులై..

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



నున్నలోని ఏకేటీపీ స్కూల్‌లో ఓటర్లు

65.69% పోలింగ్ నమోదు

- 78,063 మందికి 51,279 మందే ఓటు
- అత్యధికంగా జగ్గయ్యపేటలో 71.55 శాతం
- అత్యల్పంగా విజయవాడ పశ్చిమలో 56.03 శాతం
- ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం నుంచి రద్దీ
- కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ పరిశీలన
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు
- కృష్ణాజిల్లాలో అంతా ప్రశాంతం
- 3న గుంటూరు జిల్లాలో లెక్కింపు
- 5న ఫలితాలు వెలువడే అవకాశం



పటమట హైస్కూల్‌లో ఓటేసిన ఎంపీ కేశినేని చిన్ని

పెద్దల పోరుకు ఓటర్లు తరలివచ్చారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన తొలి సమరంలో చైతన్యం చూపించారు. చెదురుమదురు ఘటనలు మినహా గురువారం జిల్లాలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. మొత్తం 65.69 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల వరకూ ఓ మోస్తరుగానే సాగిన పోలింగ్ సాయంత్రం తర్వాత ఊపందుకుంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్య జరిగిన ప్రధాన పోరులో విజేతలెవరనేది మార్చి 5వ తేదీన తెలిసే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతపూరిత వాతావరణంలో జరిగాయి. జిల్లావ్యాప్తంగా 65.69 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం పట్టభద్ర ఓటర్లు 78,063 మంది ఉండగా, 51,279 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద చిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాలు ఖాళీగా ఉంటే, కొన్ని రద్దీగా కనిపించాయి. ఉదయం 11 గంటల వరకు పోలింగ్ శాతం చాలా తక్కువ నమోదైంది.

మధ్యాహ్నం నుంచి పెరిగిన రద్దీ

ప్రతి రెండు గంటలకు పోలింగ్ నమోదు శాతాన్ని ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉదయం 10 గంటలకు 10.87 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 28.90 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు మిగతా 6లో..

కృష్ణాలో 69.92 శాతం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో 69.92 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ బాలాజీ పర్యటించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. మచిలీపట్నం హిందూ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. మచిలీపట్నంలోని హైనీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి కలెక్టర్ బాలాజీ సతీసమేతంగా వచ్చి ఓటు వేశారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు పలుచోట్ల పర్యటించారు. జిల్లాలో 63,114 మంది ఓటర్లు ఉండగా, 44,131 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 25,028 మంది, మహిళలు 19,103 మంది.

ఓటెత్తిన చైతన్యం





జగ్గయ్యపేటలో ఓటేసిన దివ్యాంగుడు, నగరంలోని సీవీఆర్ స్కూల్‌లో నడవలేని స్థితిలో ఓటేయడానికి వస్తూ..



పీటీ ఉషకు స్వాగతం

ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషకు గురువారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి విమానంలో ఇక్కడికి విచ్చేసిన ఆమెకు క్రీడా సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబును కలిసేందుకు ఉష రోడ్డు మార్గంలో వెళ్లారు. - గన్నవరం, ఆంధ్రజ్యోతి



బాలానందం

నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన స్వగ్రామమైన నిమ్మకూరులో గురువారం సందడి చేశారు. బంధువుల ఇంట్లో కొంతసేపు ఉన్న ఆయన స్థానికులతో ముచ్చటించారు. వారి క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. అనంతరం అభిమానులతో ఫొటోలు దిగారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులర్పించారు.

అటానమస్ లేకుండానే..

కోర్సుల ఆఫర్

- ఆంధ్రా లయోల కళాశాల నిర్వాకం
- కృష్ణా వర్సిటీ త్రిసభ్య కమిటీ నివేదిక
- లయోల యాజమాన్యానికి షోకాజ్
- వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో మరోమారు నోటీసు
- చర్యలకు ఉన్నత విద్యాశాఖకు లేఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అటానమస్ హోదా లేకపోయినా ఆంధ్రా లయోల కాలేజీ యాజమాన్యం వ్యవహారాలను సాగించిందని, దుర్వినియోగానికి పాల్పడిందని కృష్ణా యూనివర్సిటీ నియమించిన త్రిసభ్య కమిటీ నిర్ధయించింది. దీనికి సంబంధించిన సవివర నివేదికను వర్సిటీ వీసీ శోభన్‌బాబుకు అందించింది. దీంతో ఆంధ్రా లయోల కాలేజీపై తదుపరి చర్యల కోసం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు వీసీ లేఖ రాశారు.

త్రిసభ్య కమిటీ పరిశీలనలో..

లయోల కాలేజీ యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు, కృష్ణా యూనివర్సిటీకి ఇటీవల ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆరా తీయగా, కృష్ణా యూనివర్సిటీ వీసీ త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రొఫెసర్లు ఎంవీ బసవేశ్వరరావు, వైకే సుందరకృష్ణ, పి.వీరబ్రహ్మాచారితో కూడిన కమిటీ కొద్దిరోజులుగా లయోల కాలేజీ వ్యవహారాలను పరిశీలించింది. లయోల కళాశాల నాక్ గుర్తింపు, యూజీసీ స్వయంప్రతిపత్తి ప్రస్తుత పరిస్థితి, గడువు తర్వాత లయోల కాలేజీలో నిర్వహించిన పరీక్షలు, అకడమిక్ కౌన్సిల్ సమావేశాలు, విద్యా కార్యకలాపాలను మిగతా 6లో..

ప్లాట్ల కోసం పాట్లు..!

- జేఎన్ఎన్యూఆర్ఎం హౌసింగ్ టౌన్‌షిప్‌కు భూములిచ్చినవారి పరిస్థితి ఘోరం
- దశాబ్దం గడిచినా నేటికీ అందని రిటర్నబుల్ ప్లాట్లు
- వన్‌టౌన్, గొల్లపూడి భూ యజమానుల విలవిల

6లో

స్పాట్‌లో తప్పించుకుంటాడు..!



స్పా సెంటర్ ఘనుడు భార్గవ్ కొత్తకొత్త కథలు

- ఎంపీ, ఎమ్మెల్యేలకు బంధువునంటూ మాయమాటలు
- వారి పేర్లు చెప్పి పోలీసులకు సైతం బెదిరింపులు
- బెజవాడే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా స్పా సెంటర్లు
- ఉత్తరాది నుంచి యువతులను తెప్పించి ఎర
- రోజుకు రూ.7 లక్షల వరకు ఆదాయం
- తొలుత స్పాలో భాగస్వామిగా చేరి తర్వాత కబ్జాలు
- పోలీసుల నుంచి విటులను కాపాడేందుకు కొత్త టెక్నాలజీ

'ఎమ్మెల్యే మా మామయ్య. ఎంపీ మా సమీప బంధువు..' అంటూ ప్రచారం చేసుకుంటాడు. పోలీసులకు కూడా ఆ పేర్లు చెప్పి బెదిరిస్తాడు. హైటెక్ మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్న చలసాని ప్రసన్న భార్గవ్ ఘనత ఇది. అంతేకాదు.. స్పా సెంటర్లలో భాగస్వామిగా చేరి, అక్రమంగా కబ్జాలు చేసి, ఉత్తరాది నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించడమే కాదు.. కొత్త టెక్నాలజీతో విటులను పోలీసుల నుంచి కాపాడటంలో భార్గవ్ అవలంబిస్తున్న కథలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉత్తరాది నుంచి అమ్మాయిలను విజయవాడ తీసుకురావడానికి చలసాని ప్రసన్న భార్గవ్ పెద్ద నెట్‌వర్క్‌నే ఏర్పాటు చేసుకున్నాడు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న మసాజ్ సెంటర్ల గురించి తెలుసుకుని వాటి యజమానులతో పరిచయం పెంచుకుంటాడు. అందులో భాగస్వామిగా చేరి తర్వాత మొత్తం స్పా సెంటర్లు కబ్జా చేస్తాడు. తర్వాత వాటిని వ్యభిచార కేంద్రాలుగా మార్చేస్తాడు. స్పా సెంటర్ల ముసుగులో నడపడం భార్గవ్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నిసార్లు పోలీసులకు చిక్కినా కొన్నాళ్ల తర్వాత మళ్లీ అదే బాటను ఎంచుకుంటాడు. పోలీసులు దాడులు చేశాక అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. కోర్టుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసి అరెస్టు నుంచి ఉపశమనాలు పొందుతాడు. ఆ తర్వాత పేర్లు మార్చి కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తాడు. భార్గవ్ గురించి పోలీసులు కూపీ లాగుతుండగా, బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

పకడ్బందీ ప్రణాళికతో..

భార్గవ్ హైటెక్ వ్యభిచార ఛాయలు విజయవాడలోనే కాదు.. రాష్ట్రంలోని ప్రముఖ మిగతా 6లో..

ఖరీఫ్‌లో 2,36,803 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి — కలెక్టర్ లక్ష్మీశ 6

కలెక్టర్ సుడిగాలి పర్యటన

జిల్లావ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించిన లక్ష్మీశ

కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలెక్టర్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నగరంలోని పటమట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన లక్ష్మీశ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల కేంద్రం నుంచి పోలింగ్ సరళిని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. అలాగే పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళిని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్‌యాదవ్‌తో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు.

జగ్గయ్యపేటలో పోలింగ్ కేంద్రం తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలో బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 6 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ లక్ష్మీశ తనికీ చేశారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని, బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కావటంతో నెమ్మదిగా సాగుతుందన్నారు. సౌకర్యాలపై ఎక్కడా ఫిర్యాదులు లేవన్నారు.

కలెక్టర్ రాకతో ఎత్తేసిన క్యాంప్‌లు

పోలింగ్ కేంద్రానికి దగ్గరలో ఆర్ అండ్ బీ బంగ్లా సమీపంలో కూటమి, పీడీఎఫ్ అభ్యర్థి తరఫున క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో కలెక్టర్ రావటంతో అధికారులు టెంట్లను తొలగించారు. ఆయన వెళ్లాక టెంట్లు లేకపోయినా నేతలు క్యాంప్‌ను కొనసాగించారు.

నందిగామలో...

నందిగామ: మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కలెక్టర్ లక్ష్మీశ నందిగామలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి ఓటర్లతో మాట్లాడారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జి.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోని పోలింగ్ సరళిని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు అందించి ఆదేశాలు జారీ చేశారు.

రిసెప్షన్ సెంటర్ పరిశీలన

కలెక్టరేట్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ లక్ష్మీశ గురువారం రాత్రి పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని స్వీకరించి భద్రపరిచే ప్రక్రియను పరిశీలించారు. చెక్ లిస్ట్ ప్రకారం సామగ్రి మొత్తం అందుతోందా, లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్ల వారీగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను పటిష్ఠ భద్రతతో గుంటూరులోని ప్రధాన స్ట్రాంగ్ రూంకు శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో పంపుతామన్నారు.

ఖరీఫ్‌లో 2,36,803 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి: కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఖరీఫ్ పంటకాలంలో జిల్లాలో 2,36,803 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రభుత్వం 1,13,500 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్ణయించి, ఇప్పటికి 1,10,513.480 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్న అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఖరీఫ్ 2024-25 పంట కాలానికి సంబంధించి మార్చి 3 నుంచి మూసివేయడం జరుగుతుందన్నారు. కావున రైతులంతా ధాన్యాన్ని ఇంకా విక్రయించాల్సి ఉంటే వెంటనే సమీప కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాల్సిందిగా కలెక్టర్ కోరారు.



జగ్గయ్యపేటలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, నందిగామలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, తిరువూరులో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి, విజయవాడలో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబం

దివ్యాంగ మాస్టర్ ఆదర్శం

జి.కొండూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాళ్లు చేతులన్నీ సవ్యంగా ఉన్నవారే ఓటు వేసేందుకు వెనకాడుతున్నారు. దీంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతూ ఉంటుంది. అయితే వెల్లటూరుకు చెందిన బీవీ వెంకట రాజమోహన్ అనే దివ్యాంగ ఉపాధ్యాయుడు ఇప్పటి 5సార్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేశానని చెప్పాడు. గురువారం ఆయన జి.కొండూరు పోలింగ్ బూత్‌కు కుటుంబ సభ్యులు, స్నేహితుల సాయంతో వచ్చి ఓటు వేశారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని అన్నారు. ఓటు వేయడం తనకెంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు.



జి.కొండూరు పీఎస్‌లో ఓటు వేసి వస్తున్న వెల్లటూరుకు చెందిన దివ్యాంగ ఉపాధ్యాయుడు బీవీ వెంకట రాజమోహన్



ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే వసంత, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు

● ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం నియోజకవర్గంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లు వేసినందుకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అధికారులకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని జాకీర్‌హుస్సేన్ కళాశాలలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో కలిసి పరిశీలించారు. దారు నాయక్, చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, మైలా సైదులు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, నూతులపాటి బాలకోటేశ్వరరావు, లంక లితీష్, పటాపంచల నరసింహారావు, చనమోలు నారాయణ, ఈమని మురళీకృష్ణ, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌లు తరలిస్తున్న బస్సుపై పడిన చెట్టు

సిబ్బందికి త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ముగిశాక గురువారం రాత్రి బ్యాలెట్ బాక్స్‌ను భద్రపరిచేందుకు బస్సులో తరలిస్తున్నండగా కళాశాల ఆవరణలోని ఓ ఎండు చెట్టు కొమ్మకు బస్ టాప్ తగలడంతో కొమ్మతో పాటు చెట్టు మొత్తం బస్‌పై పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్‌లో ఉన్న సిబ్బంది త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పక్కనే ఉన్న పోలీస్ సిబ్బంది చెట్టుకు తాడు కట్టి బస్‌పై నుంచి చెట్టును పక్కకు తప్పించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న విద్యాసాగర్ దంపతులు

గాంధీనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏ విద్యాసాగర్ గురువారం తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. గాంధీనగర్‌లోని చిట్టూరి మున్సిపల్ పాఠశాలలో తమ సతీమణి సుధారాణితో కలిసి వచ్చి ఆయన ఓటు వేశారు.

నా ఓటు ఎవరేశారు..?

● అధికారులను నిలదీసిన మహిళ
● టెండర్ ఓటుకు అనుమతిచ్చిన అధికారులు



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాలలో 43వ నంబరు పోలింగ్ బూత్‌కు వచ్చిన గుంటుపల్లికి చెందిన పాటిబండ్ల జ్ఞానదీప్తి 331 క్రమ సంఖ్యలో ఉన్న ఆమె ఓటును వేరేవారు వేసినట్టు ఉంది. దీంతో ఆమె అధికారులను నిలదీసింది. నా ఓటు ఎవరో వేస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల సహాయాధికారి వై.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ అధికారి ఆమెకు టెండర్ ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వడంతో ఆమె ఓటు వేశారు.

స్పాట్‌లో తప్పించుకుంటాడు..!

(5వ పేజీ తరువాయి)

నగరాల్లోనూ ఉన్నాయి. ఉత్తరాది యువతులను తీసుకొచ్చి మసాజర్లగా నియమించాడు. కొద్దిరోజుల క్రితమే రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో కొత్తగా స్పా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఇవికాకుండా ఒంగోలు, నెల్లూరు నగరాల్లోని స్పా కేంద్రాల్లో భాగస్వామిగా చేరి, తర్వాత వాటిని కబ్జా చేసినట్టుగా పోలీసులకు సమాచారం అందింది. ఉత్తరాది యువతను ఏరి విజయవాడకు తీసుకురావడానికి సతీష్ అనే వ్యక్తిని ఉపయోగించుకున్నట్టు సమాచారం. అతడికి ఉత్తరాది యువతులతో సంబంధాలు ఉన్నాయి. భార్గవ్ ఏర్పాటుచేసే స్పాల్లో ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఘజియాబాద్ యువతులు ఉండటమే ఇందుకు నిదర్శనం. అలాగే, స్పా కేంద్రాలన్నీ అతడి ఆధీనంలోనే ఉన్నా వాటి అనుమతులను వేర్వేరు వ్యక్తుల పేర్లపై తీసుకుంటాడు. పోలీసులు తాజాగా దాడి చేసిన స్టూడియో 9స్పా కిషోర్ అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్టు గుర్తించారు. ఇది కాకుండా సతీష్ సోదరుడు కుమార్ పేరు మీద కొన్ని స్పా సెంటర్లను నిర్వహిస్తున్నట్టు తెలిసింది. భార్గవ్, కుమార్, సతీష్ వద్ద ఉత్తరాదికి చెందిన 10 వేల మంది యువతుల డేటా ఉన్నట్టు సమాచారం. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపిక చేసినట్టుగా ఉత్తరాది అమ్మాయిలను ఇక్కడకు తీసుకొస్తారు. స్టూడియో 9స్పాలో చిక్కిన యువతుల ఫోన్లలో డేటాను పోలీసులు పరిశీలించగా, వారంతా తమ ఆధార్‌కార్డులను భార్గవ్ ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పంపినట్టు గుర్తించారు. ఇలా ఎందుకు చేశారని పోలీసులు ప్రశ్నించగా, ఆయన స్పాల్లో పనిచేయాలంటే ఆధార్‌కార్డు ఇవ్వాలని సదరు యువతులు తెలిపారు. వెటర్నరీ కాలనీలోని స్టూడియో 9స్పా నిర్వహిస్తున్న భవనం తన సొంతమేనని భార్గవ్ పోలీసులకు తెలిపాడు. పోలీసుల విచారణలో భవనం అతడిది కాదని తేలింది. ఈ భవనానికి నెలకు రూ.లక్ష చొప్పున అద్దె కూడా చెల్లిస్తున్నారు. భార్గవ్ నిర్వహించే స్పాలో రోజుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్పాల్లో రోజుకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు సంపాదిస్తున్నాడు. అలాగే, స్పాలోని అన్ని గదుల్లో ఉన్న విద్యుద్దీపాలను టూవే విధానంలో తన చాంబర్‌లో ఉన్న స్విచ్‌కు అనుసంధానం చేయించుకున్నట్టు సమాచారం. విటులు గదుల్లో సర్వీసు చేయించుకుంటున్న సమయంలో పోలీసులు వస్తే భార్గవ్ తన చాంబర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా చూస్తాడు. వెంటనే అతడి వద్ద ఉండే స్విచ్ వేసి పోలీసులు వస్తున్నట్టు సిగ్నల్ ఇస్తాడు. లైట్లు ఆన్ కాగానే విటులు గదుల నుంచి బయటకు వచ్చి పక్కనే ఉన్న భవనంపైకి పారిపోయేలా శిక్షణ ఇచ్చాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

జి.కొండూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఇద్దరు విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఒక విద్యార్థిని మృతి చెందగా మరో విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి చెందిన పొనుగుమాటి నాగచైతన్య (15), సరిపల్లి విష్ణు గురువారం ఉదయం మోటార్ బైక్‌పై వెలగలేరు వైద్యశాలకు బయలుదేరారు. మార్కెట్ యార్డ్ వద్దకు రాగానే విజయవాడవైపు నుంచి ఎదురుగా వస్తున్న హైషేర్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో నాగచైతన్య ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా, విష్ణుకు గాయాలయ్యాయి.

ప్లాట్ల కోసం పాట్లు..!

జేఎన్ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ టౌన్‌షిప్‌కు భూములిచ్చినవారి పరిస్థితి ఘోరం

● దశాబ్దం గడిచినా నేటికీ అందని రిటర్నబుల్ ప్లాట్లు
● వీఎంసీ, రెవెన్యూ అధికారుల చేతిలో వన్‌టౌన్, గొల్లపూడి భూ యజమానుల విలవిల

జక్కంపూడిలో జేఎన్ఎన్‌యూఆర్ఎం మెగా హౌసింగ్ టౌన్‌షిప్‌కు భూములిచ్చిన వారికి నేటికీ ప్యాకేజీ అందని పరిస్థితి. దాదాపు దశాబ్దం గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. తమకివ్వాల్సిన ప్యాకేజీ ప్రకారం రిటర్నబుల్ ప్లాట్లను ఇవ్వటం లేదని బాధితులు లబోదిబోమంటున్నారు.

ఆంధ్రజ్యోతి, విజయవాడ: నగరంలోని పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా ఉన్నప్పుడు నగరంలో 10వేల మందికి ఇళ్లు కల్పించేందుకు జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో భాగంగా కార్పొరేషన్ అధికారులు జక్కంపూడిలో మెగా హౌసింగ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో భూమలిచ్చిన రైతులు, స్థలాల యజమానుల నుంచి 60:40 విధానంలో భూములు తీసుకున్నారు. ఈ టౌన్‌షిప్‌ఎకు కాస్త ఎగువన కొత్తూరు తాడేపల్లి వెళ్లే మార్గంలోనే భూములిచ్చిన రైతులకు లే అవుట్లు వేసి వారికివ్వాల్సిన 40శాతం ప్యాకేజీలో భాగంగా ప్లాట్లు వేశారు. అప్పట్లోనే చాలామందికి ఇచ్చినా కొంతమందికి నేటికీ ఇవ్వలేదు. వీఎంసీ కమిషనర్లు, అధికారులు మారటంతో నెలకొన్న గందరగోళం వల్ల వారంతా బాధితులుగానే ఉన్నారు. వారిలో వన్‌టౌన్, గొల్లపూడి ప్రాంతానికి చెందినవారే ఎక్కువ. పెద్దసంఖ్యలో భూములిచ్చిన వారికి న్యాయం జరిగినా, గజాల లెక్కన ఇచ్చిన వారి విషయంలోనే సమస్య. వీఎంసీ అధికారుల వద్దకు వెళ్తే రెవెన్యూ వద్దకు దగ్గరకు వెళ్లమని, వారి వదద్దకు వెళ్తే వీళ్ల వద్దకు వెళ్లమని అనేక ఏళ్లుగా తిప్పిస్తున్నారు. ఏ ప్రభుత్వం కడాఆ తమ గోడు వినటం లేదని కూటమి ప్రభుత్వం అయినా ఈ సమస్యను పరిష్కరించాలని గొల్లపూడి, వన్‌టౌన్ ప్రాంతాల భూ యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పవన్‌పై నోరు పారేసుకుంటే సహించం

● దువ్వాడ వ్యాఖ్యలపై మండిపడిన జనసేన నేతలు మండలి, ఉదయభాను

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలకు దమ్ముంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు చూపించాలని, లేకుంటే తమ జనసైనికులు, వీర మహిళలు రాష్ట్రంలో తిరగనివ్వరని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను హెచ్చరించారు. జగ్గయ్యపేటలోని సామినేని ఉదయభాను నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దువ్వాడ ఎమ్మెల్సీ హోదాలో శాసనమండలిలో చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, లేకుంటే మండలి చైర్మన్‌కు నోటీసు తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని ఎమ్మెల్సీ దువ్వాడతో పాటు వైసీపీ నేతలు అంటున్నారని, 2019కు ముందు ప్రతిపక్ష హోదా ఉంటే ఏం చేశారని ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందో తెలియని అజ్ఞానంలో వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు పవన్ కల్యాణ్‌పై ప్యాకేజీ మాటలు మాట్లాడారని, ఎందుకు నిరూపించుకోలేకపోయారన్నారు. కూతురు వయసున్న పరాయి మహిళతో తిరుమల వంటి పవిత్ర స్థలంలో రీల్స్ చేసిన దువ్వాడకు ఎమ్మెల్సీ ఇచ్చిన జగన్ ఏం నాయకుడని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా మాట్లాడే వైసీపీ నేతలను వదిలేది లేదని, చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జనసేన నేతలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి ఎన్‌సీసీ సూపరింటెండెంట్ ఆత్మహత్య

విద్యాధరపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భవానీ ఐలాండ్ సమీపంలోని కృష్ణానదిలో ఎన్‌సీసీ విభాగంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ కారుమూడి విజయలక్ష్మి (60) కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. కృష్ణాజిల్లా తాడిగడప డొంకరోడ్డు గ్రీన్ సిటీ పక్కనే ఉన్న శివం ఎన్‌క్లేవ్, ప్లాట్‌నెంబరు 305లో కారుమూడి విజయలక్ష్మి నివాసం ఉంటున్నారు. భర్తతో మనస్పర్థలు రావటంతో 15ఏళ్ల క్రితం విడిపోయి కుమార్తెతో ఉంటుంది. కుమార్తె బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఈఏ భారతీనగర్‌లోని 4వ ఆంధ్ర బాలికల ఎన్‌సీసీ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు పర్మిషన్ తీసుకుని 2.30 గంటలకు భవానీ ఐలాండ్‌కు బోటులో వెళ్లింది. సుమారు 3.30 నుంచి 4 గంటల మధ్య బోటులో ప్రయాణిస్తూ కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న భవానీపురం పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి విజయలక్ష్మి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కుమార్తెకు సమాచారం ఇచ్చారు. కుమార్తె ఇచ్చే ఫిర్యాదును బట్టి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఆమె ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది.

కోర్సుల ఆఫర్

(5వ పేజీ తరువాయి) ఈ కమిటీ పరిశీలించింది. 2021, అక్టోబరు నుంచి యూజీసీ స్వయంప్రతిపత్తి హోదాను పొందకుండానే పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆర్థిక, సాధారణ పరిపాలనా వ్యవహారాల్లో ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా గుర్తించారు. దీంతో కాలేజీ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా కమిటీ సూచించింది. ఆ సూచన మేరకు లయోల యాజమాన్యానికి షోకాజ్ నోటీసును జారీ చేసినట్టు వీసీ.. ఉన్నత విద్యాశాఖకు తెలిపారు. ఈ నోటీసుపై కాలేజీ యాజమాన్యం వివరణ ఇచ్చిందని, వాటాదారుల సంక్షేమం కోసం స్వయం ప్రతిపత్తిని కొనసాగించటానికి అనుమతించాలని అభ్యర్థించినట్టు ఆయన తెలిపారు. కళాశాల ఇచ్చిన వివరణపై మరోమారు త్రిసభ్య కమిటీ సమావేశమై తమ సిఫార్సులను అందించిందన్నారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన వివరణ తమకు సంతృప్తిని కలిగించలేదని, యూజీసీ నిబంధనల ప్రకారం అటానమస్ కల్పించాలంటే ఒక ఏడాది ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, అది జరగలేదన్నారు. దీనిపై మరోమారు లయోల కాలేజీ యాజమాన్యానికి నోటీసు ఇవ్వనున్నట్టు చెప్పారు. అటానమస్ లేకుండా కోర్సులు కొనసాగించడంపై తదుపరి చర్యల కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరామన్నారు.



శోభాయమానం

కెనాల్ రోడ్డులో ఘనంగా రథోత్సవం

వన్‌టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో మహా శివరాత్రి పర్వదిన అనంతరం 150 ఏళ్లకు పైగా సంప్రదాయంగా కొనసాగుతున్న రథోత్సవాన్ని గురువారం కన్నులపండువగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అన్న సత్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రథోత్సవం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన గంగా, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులు, బుద్దవారి గుడిలోని వసంత మల్లికార్జునస్వామి, పార్వతీదేవి ఉత్సవమూర్తులు, పాత శివాలయంలోని భద్రకాళీ వీరభద్రస్వామి, భ్రమరాంబ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను ఒకే వేదికపై చేర్చి రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అన్నపురాశి పోసి బలిహరణలిచ్చారు. అనంతరం విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మిగతా పోలీసు అధికారులు, పోలీసులు, భక్తజనం, నిర్వాహక కమిటీ బాధ్యులతో కలిసి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు జయజయ ధ్వానాలు పలుకుతూ రథానికి స్వాగతం పలికారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వరకు సాగి, ఆ తరువాత రథం మరల వెనుదిరిగి యథాప్రదేశానికి చేరింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని వీక్షించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, డిప్యూటీ ఈవో రత్నరాజు, ఇంకా ఏఈవోలు, అధికారులు, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఈవో నటరాజన్ షణ్ముగం, అధికారులు, అర్చకులు, వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్దువారి గుడి) ఈవో సన్యాసిరావు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి అన్న సత్రం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బయన శ్రీరాజేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రథాన్ని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, పోలీసు అధికారులు, పోలీసులు, భక్తులు లాగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. చెరకుగడలు, బెల్లం మిఠాయి, బూందీ, లడ్డూలను ప్రైవేటు వ్యాపారులు రోడ్లపై విక్రయించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వరకు సాగి, తరువాత రథం మలుపు తిరిగి యథాస్థానానికి చేరుకుంది. కోలాటాలు, నృత్యాలు, పులివేషాలు, తదితరాలు కన్నుల పండువగా సాగాయి. మేళతాళాలు, వేద పఠనాలు, రథోత్సవానికి శోభ తెచ్చాయి.

దుర్గగుడిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

● మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ● భారీగా తరలివచ్చిన భక్తజనం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు, ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. అర్చకులు ఉదయం 8 గంటల నుంచి మండప పూజ, మూలమంత్ర హవనం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్యం నిర్వహించగా, అక్కడి నుంచి మండపారాధన, కలశారాధన, మూల మంత్ర హవనం, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది దంపతులు అధిరోహించిన పల్లకిని మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణ నడుమ ఈవో దేవదాయ శాఖ కమిషనర్, కె.రామచంద్రమోహన్ సమక్షంలో మల్లేశ్వరాలయం నుంచి కొండ దిగువ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ నుంచి కెనాల్ రోడ్డు రథం వద్దకు తీసుకువెళ్లారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, డిప్యూటీ ఈవో రత్నరాజు, వేద పండితులు, అర్చకస్వాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టబద్దులై..

(5వ పేజీ తరువాయి)

47.11 శాతం, సాయంత్రం 4 గంటలకు 61.99 శాతం పోలింగ్ నమోదైంది. సమయం ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్నవారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించటంతో చివరికి 65.69 శాతం నమోదైంది.

నియోజకవర్గాల వారీగా ఇలా..

తిరువూరు నియోజకవర్గంలో 9,337 మంది ఓటర్లకు 6,474 మంది ఓటుహక్కు వినియోగించుకోవటంతో 69.34 శాతం పోలింగ్ నమోదైంది. నందిగామ నియోజకవర్గంలో 6,226 మంది పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోగా, 68.61 శాతం పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 7,367 మంది ఓటర్లకు 5,271 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 71.55 శాతం పోలింగ్ నమోదైంది. మైలవరం నియోజకవర్గంలో 13,490 మంది ఓటర్లకు 9,291 మంది ఓటుహక్కు వినియోగించుకోవటంతో 69 శాతం పోలింగ్ నమోదైంది. తూర్పు నియోజకవర్గంలో 8,552 మంది ఓటర్లకు 5,932 మంది ఓటుహక్కు వినియోగించుకోవటం ద్వారా 69.36 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమ నియోజకవర్గంలో 9,868 మంది ఓటర్లకు 5,529 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 56.03 శాతం పోలింగ్ నమోదైంది. సెంట్రల్ నియోజకవర్గంలో 17,072 మందికి 10,599 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, 62.08 శాతం పోలింగ్ నమోదైంది.

స్వల్ప వివాదాలు

ఇబ్రహీంపట్నం పోలింగ్ కేంద్రంలో పాటిబండ్ల జ్ఞానదీప్తి అనే మహిళ ఓటును మరెవరో వేశారు. దీంతో జ్ఞానదీప్తి ఎన్నికల అధికారితో టెండర్ ఓటుకు డిమాండ్ చేశారు. దీంతో జ్ఞానదీప్తి ఓటరు స్లిప్, ఆధార్ కార్డు, పార్ట్ నెంబర్, ఓటర్ల జాబితా పరిశీలించి టెండర్ ఓటు వేయటానికి అనుమతించారు. ఏ.కొండూరులో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. పలువురు ఉపాధ్యాయులు కేఎస్ లక్ష్మణరావుకు ఓటు వేయాలని పోలింగ్ కేంద్రంలోకి వచ్చే వారికి చెబుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపించటంతో ఘర్షణ తలెత్తింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి చెల్లాచెదురు చేయటంతో వివాదం సద్దుమణిగింది. ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కాలేజీ పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న బస్సుపై ఒక్కసారిగా చెట్టు కూలింది. ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయటంతో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండాపోయింది. పోలింగ్‌ను కలెక్టర్ లక్ష్మీశ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించారు. 112 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

3న లెక్కింపు

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు మార్చి 3న గుంటూరు జిల్లాలో జరుగుతుంది. హోరాహోరీ సమరం జరిగిన నేపథ్యంలో రెండు, మూడు ప్రాధాన్యత ఓట్లు కూడా లెక్కించే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే కనుక జరిగితే మూడు రోజుల పాటు లెక్కింపు జరిగే అవకాశం ఉంది. మార్చి 5లోపు తుది ఫలితం వెలువడుతుంది.

ఎమ్మెల్సీ ఓటింగ్‌కు ఉదయభాను దూరం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను గురువారం ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోకపోవటం చర్చనీయాంశమైంది. ఆయనకు, ఆయన కుమారుడు, కౌన్సిలర్ వెంకట కృష్ణప్రసాద్, భార్య, ఇతర కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉంది. గురువారం స్థానికంగానే ఉన్న ఆయన పోలింగ్‌లో మాత్రం పాల్గొనలేదు. జనసేన నేతలు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించలేదు. మొదటి నుంచి జనసేనలో ఉన్న నేతలు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ విషయమై ఉదయభానును ప్రశ్నించగా.. తమ వద్ద పనిచేసే గురుప్రసాద్ అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందటంతో అక్కడకు వెళ్లానన్నారు.

విజయవాడ తూర్పు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. బెంజిసర్కిల్, పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్, మైత్రేయ వీధి, బీఎస్ఎన్ఎల్ హెచ్ పాయింట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.


లయోలా కాలేజీలోని బూత్‌లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్న చిద్విల రాణి


పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు, ఓటర్ల ధ్రువీకరణ పత్రం పరిశీలిస్తున్న పోలీసు, బారులు తీరిన ఓటర్లు, లయోలా పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

తూర్పు నియోజకవర్గంలో 69.36 శాతం పోలింగ్

పటమట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 8552 మంది ఓటర్లకు గాను 5932 మంది ఓటు హక్కు వినియోగించుకోవటం ద్వారా 69.36 శాతం పోలింగ్ నమోదు అయింది.

వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తే మండలి బయటే ఉంటారు

మంత్రి సత్యకుమార్ , ఎమ్మెల్యే గద్దె

సార్వత్రిక ఎన్నికల్లో 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపిస్తే వారు అసెంబ్లీకి రాకుండా బయటే తిరుగుతున్నారని అలాంటి వైసీపీ మద్దతు తీసుకుంటున్న అభ్యర్థులను గెలిపిస్తే వారు మండలి బయటే ఉంటారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు అన్నారు. పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని వారు గురువారం పరిశీలించి మాట్లాడుతూ గత ఐదేళ్లగా రాష్ట్రంలో వైసీపీ చేసిన అరాచకాలకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడి కూటమికి పట్టం కట్టారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. పీడీఎస్ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావుకు వైసీపీ మద్దతు ఉందన్నారు. ఈకార్యక్రమంలో కోనేరు రాజేష్, చెన్నుపాటి గాంధీ, జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, గద్దె ప్రసాద్, శాయిన బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.


పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే గద్దె , బొప్పన

ఓటు హక్కును వినియోగించుకున్న గద్దె కుటుంబం

కోనేరు బసవపున్నయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆయన సతీమణి గద్దె అనురాధ, కుమారుడు క్రాంతి కుమార్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. గద్దె ప్రసాద్, పేరేపి ఈశ్వర్, నర్రా కిషోర్, వీరమాచనేని రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ దంపతులు ..

పటమట: ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీ కేశినేని శివనాథ్ తన ఓటు హక్కును పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో వినియోగించు కున్నారు. ఆయన తన సతీమణి కేశినేని జానకీ లక్ష్మితో కలిసి సాధారణ ఓటర్ల మాదిరిగా క్యూ లైన్‌లో నిలబడి ఓట్లు వేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన సంతృప్తి చెందారు.


లయోలా కాలేజీలో పోలింగ్ సరళిని పరిశీలించిన రవినాయుడు, గద్దె క్రాంతికుమార్, కృష్ణలంకలో ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి

లయోలా కళాశాలలో 70 శాతం పోలింగ్

భారతీనగర్: ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎన్నికలు ఆంధ్రా లయోలా పోలింగ్ సెంటర్లో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఆంధ్రా లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన 106, 107, 108 పోలింగ్ బూత్ నెంబర్లు 2518 పట్టభద్రులకుగాను 1763 పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోలింగ్ 70శాతం ఉందని అధికారులు తెలిపారు.

రవినాయుడు, గద్దె క్రాంతికుమార్ పోలింగ్ కేంద్రం పరిశీలన

తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రానికి శాప్‌చైర్మన్ రవినాయుడు, టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్‌లు వెళ్లి ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని స్థానిక కూటమి శ్రేణులను, బూత్‌లెవల్ ఏజెంట్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి కూడా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. వీరితో జనసేన నాయకులకు అమ్మిశెట్టి వాసు, వెలగపూడి శంకర్ బాబు ఉన్నారు.


లయోలా కళాశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద చిన్నబిడ్డను ఎత్తుకుని నిలబడ్డ యువకుడు

కృష్ణలంకలో 605 ఓట్ల పోలింగ్

కృష్ణలంక: కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో (పోలింగ్ స్టేషన్ నెం.90) ఎమ్మెల్సీ ఓటర్లు మొత్తం 1006 వుండగా పోలింగ్ ముగిసే సమయానికి 605 ఓట్లు పోలయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం నుంచి మందకొండిగా ప్రారంభమైన ఓటింగ్ నిదానంగా పెరిగింది. మధ్యాహ్నం తరువాత ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. వీరిలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ దంపతులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్

రాయల్ సీసీపై ఆంధ్ర బ్లూస్ విజయం

విజయవాడ(స్పోర్ట్స్),ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో గురువారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో రాయల్ సీసీ, ఆంధ్రబ్లూస్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రబ్లూస్ జట్టు 49.5 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 218పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ సీసీ జట్టు 42.2 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 159పరుగులతో ఓటమి పాలైంది. న్యూ ఎవరెస్ట్, పటేల్ సీసీ జట్టు మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎవరెస్ట్ జట్టు 50ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 345పరుగులు భారీ స్కోర్ చేసింది. జట్టులో కెఎస్ఎన్.శ్రీనిద్యా 98పరుగులు, సాయి అఖిల్ 86పరుగులు, జాశ్విన్ 63పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన పటేల్ సీసీ జట్టు 43.5 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 261పరుగులతో ఓటమి పాలైంది. న్యూ ఎవరెస్ట్ బౌలర్ మనోహర్ 4వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టండి

● కమిషనర్ ధ్యానచంద్ర


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మురుగునీటి పారుదలకు ఆటంకం కలగకుండా నగర పరిధిలో ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని నగర కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం మహానాడు రోడ్డు గుంటతిప్ప అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ పలువురు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. నగరంలో ఉన్న ప్రధాన అవుట్ డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వర్షం, మురుగునీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర పరిధిలో ఎక్కడా మురుగునీరు పారుదలకు ఆటంకం కలగకుండా ప్రధాన డ్రెయిన్లు వాటికి అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు నిరంతరం కొనసాగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగానే డ్రెయిన్లలో పూడికతీత పనులు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఒక ఐడియా...పరిష్కారం చూపింది

అధికారులు మరిన్ని చర్యలు తీసుకోవాలి: స్థానికులు


దేవుళ్ల బొమ్మలతో ఉన్న గోడ

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: ఒక ఐడియా వారి సమస్యకు పరిష్కారాన్ని చూపింది. ఎవరికి చెప్పినా తీర్చలేని ఆ సమస్యకు వారే పరిష్కారాన్ని కనుగొన్నారు. రాణిగారితోట విజయకృష్ణ థియేటర్ సమీపంలో ఫీడర్ రోడ్డుపై మూత్ర విసర్జన సమస్య అధికంగా ఉంది. జాతీయ రహదారి గోడ మూత్ర విసర్జన స్థలంగా ఆకతాయిలు మార్చడంతో అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్న వారికి చాలా ఇబ్బందిగా ఉంది. దీనికి తోడు వాహనాల పార్కింగ్ స్థలంగా కూడా మారింది. వీరిని ఎవరైన ప్రశ్నిస్తే దాడులకు కూడా దిగుతున్నారని స్థానికులు అంటున్నారు. అయితే ఈ సమస్యను ఎవరికి చెప్పుకున్నా ప్రయోజనం లేకపోవడంతో అక్కడ ఉండే ఒక వ్యాపారి చక్కని ఆలోచన చేశాడు. ఎక్కడైతే మూత్ర విసర్జన చేస్తున్నారో ఆ గోడకు అన్ని మతాలకు సంబంధించిన పలువురు దేవుళ్ల ఫొటోలతో ఉన్న బ్యానర్ ఏర్పాటు చేశాడు. దీంతో ఇక్కడ మూత్ర విసర్జన చేయడం లేదు. ఒక మంచి ఆలోచన తమ సమస్యకు తాత్కాలిక పరిష్కారాన్నే చూపిందని శాశ్వత పరిష్కారం నగరపాలక సంస్థ అధికారులు చూపాలని కోరుకుంటున్నారు. గతంలో ఇక్కడ మొక్కలు ఉండేవని, వాహనాల పార్కింగ్ వల్ల అవి కనుమరుగయ్యాయని అంటున్నారు. అధికారులు స్పందించి ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా ఉన్న వాల్ నుంచి సిమెంట్ గోడౌన్ వరకు మొక్కలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


శ్రీ గంగ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి

అంగరంగ వైభవంగా రామలింగేశ్వర స్వామి ఊరేగింపు

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ తల్లి ఉపాలయమైన శ్రీ గంగ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ విగ్రాహాల ఊరేగింపు రామవరప్పాడు పురవీధుల్లో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రియాంక, కోలా ఆనంద్, సాయిరామరాజు, నబిగాని కొండ, భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో విరిగిన ప్రభ

పెనమలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకొంది. ఉత్సవాల్లో పాల్గొన్న ఒక ప్రభ సగానికి విరిగి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. ఎన్టీఆర్ బస్‌స్టాప్ వద్ద ఉన్న మసీదు ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయకంపితులయ్యారు. మూడు విద్యుత్ స్థంభాలు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమయిన విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన క్రేన్లు తెచ్చి విరిగిన ప్రభను తీయించివేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


విరిగిన ప్రభ

రెండు ప్రభల మధ్య వివాదం

యనమలకుదురులో రెండు ప్రభల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకొంది. రెండు ప్రభల నిర్వాహకులు పరస్పరం గొడవకు దిగడంతో పెనమలూరు పోలీసులు రంగంలోకి దిగి వారిని లాఠీలతో చెదరగొట్టారు. కాసేపటికి వివాదం సద్దుమణిగింది.

నున్నలో 58శాతం పోలింగ్

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. గ్రామ హైస్కూల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 58 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఏడీసీపీ రామకృష్ణ బందోబస్తును పరిశీలించారు.


పోలింగ్ బూత్ వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఏడీసీపీ రామకృష్ణ

రథోత్సవంలో భక్తులకు ప్రసాదాల వితరణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రెండో రోజు రథోత్సవం సందర్భంగా గురువారం నూకల మురళి ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కెనాల్ రోడ్డు, వినాయకుడి గుడి వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు. దాతలకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. సభ్యులు పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, వక్కలగడ్డ అమర్, వందనపు శ్రీనివాసరావు, పెరుమాళ్ళ శ్రీమన్నారాయణ, తొండేపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.







గాంధీజీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో పట్టభద్రులు

ఆర్టీసీ జోనల్ కార్యాలయం వద్ద బుద్దా వెంకన్న, దూండీ రాకేష్ తదితరులు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు వృద్ధులు సైతం

ఓట్లేసిన పట్టభద్రులు

వన్‌టౌన్, విద్యాధరపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో గురువారం జరిగిన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 56శాతం నమోదైంది. ఉదయం 8 నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవ టానికి పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. వన్‌టౌన్ గాంధీజీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 82, 83, 83ఎ, 86, 87, 88 పోలింగ్ బూత్‌లు, విద్యాధరపురం, షైనంపల్లి పోలీస్ ప్రాథమిక హైస్కూల్‌లో 80, 80ఎ, 81, 81ఎ, 85, 85ఎ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. విద్యాధరపురం, ఏపీఎస్ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో 79, 79ఎ, 84 బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 9,868 ఓట్లు ఉండగా, 5,529మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 56.03శాతం పోలింగ్ నమోదు అయినట్టు అధికారులు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్లను ఏర్పాటు చేశారు.

కేంద్రాలను పరిశీలించిన మంత్రి సత్యకుమార్

పశ్చిమలోని పోలింగ్ కేంద్రాలను మంత్రి సత్యకుమార్ యాదవ్, కూటమి, కమ్యూనిస్టు నాయకులు వేర్వేరుగా పరిశీలించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండీ రాకేష్, ఎన్డీయే నాయకులు బుద్దా వెంకన్న, కొనకళ్ల బుల్లయ్య, నాగుల్ మీరా, ఎం.ఎస్.బేగ్, మహమ్మద్ ఫతావుల్లా, అడ్డూరి శ్రీరామ్, నరేంద్ర రాఘవ, తదితరులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం కార్పొరేటర్ బోయ సత్యబాబు నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు పశ్చిమ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ దుర్గారావు పర్యవేక్షణలో వన్‌టౌన్, భవానీపురం సీఐలు గురుప్రకాష్, ఉమామహేశ్వరరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వన్‌టౌన్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో విజయవాడ సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం విజయవాడ పాతబస్తీ, గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 82లో ఆయన తన ఓటు వినియోగించుకున్నారు.


గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో ఫతావుల్లా తదితరులు


షైనంపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాలలో..



ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పూడికతీత పనులు చేపట్టండి

కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి పారుదలకు ఆటంకం కలగకుండా నగర పరిధిలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల్లో ఎప్పటికపుడు పూడికతీత పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మహానాడు రోడ్డు గుంటతిప్ప అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో గురువారం జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. నగరంలోని ప్రధాన అవుట్ డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వర్షం, మురుగునీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడా మురుగునీరు పారుదలకు ఆటంకం కలగకుండా ప్రధాన డ్రెయిన్లు వాటికి అనుసంధానంగా ఉన్న డ్రెయిన్‌లలో పూడికతీత పనులు నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నిరోధక చర్యలు పాటించాలి

అజిత్‌సింగ్‌నగర్ : ప్రైవేట్ ఆసుపత్రులలో అగ్నిప్రమాదాల నిరోధక చర్యలు కచ్చితంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని గురువారం ఆయన పరిశీలించి అగ్నిప్రమాద నిరోధక చర్యలను తనిఖీ చేశారు. అగ్నిప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆసుపత్రిలో ఎమెర్జెన్సీ ఎగ్జిట్‌లు ఎక్కడ ఎక్కడ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

శ్మశానవాటికల్లో మరమ్మతులు చేయాలి

పాయకాపురం: శ్మశానవాటికలో మరమ్మతు పనులు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. పాయకాపురంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశానవాటికలను గురువారం పరిశీలించారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ మరుగుదొడ్లు, నీటి సరఫరా, షెడ్ నిర్మాణాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

జక్కంపూడి కాలనీలో తాగునీటి సమస్య రానీయొద్దు

విజయవాడ రూరల్: జక్కంపూడి కాలనీలో ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. జక్కంపూడి కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. పలు బ్లాక్‌లలో పారిశుధ్యం, మురుగునీటి పారుదల సమస్యలను పరిశీలించారు. తక్షణం పారిశుధ్యం మెరుగుపరచి, మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని, రోడ్ల అభివృద్ధి పరచాలని మొక్కలునాటి కాలనీలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందించాలని సూచించారు.

ఇక్కడ కోడ్ అమలుకాదా..?

టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు ఫతావుల్లా



వన్‌టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ వద్ద ఉన్న వైసీపీ నాయకుల ఫొటోలతో ఉన్న శిలాఫలకం సంబంధిత అధికారులకు కనిపించ లేదా అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా ప్రశ్నించారు. గురువారం గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ వద్ద బహిరంగంగా కనిపిస్తుంటే ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అవి కనిపించకుండా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

ఎమ్మెల్యే బొండా ఉమా స్లిప్పుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ : అజిత్‌సింగ్‌నగర్‌లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో 4837 మందికిగాను 3033 మందితమ ఓటు హక్కును వినియోగిందచుకున్నారు. పోలింగ్ ముగిసేసరికి 62.7 శాతం పోలింగ్ నమోదు అయింది. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుపోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లకు స్లిప్పులు అందజేశారు. ఏడీసీపీ రామకృష్ణ, అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.



ఒక ఐడియా... పరిష్కారం చూపింది

అధికారులు మరిన్ని చర్యలు తీసుకోవాలి: స్థానికులు

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: ఒక ఐడియా వారి సమస్యకు పరిష్కారాన్ని చూపింది. ఎవరికి చెప్పినా తీర్చలేని ఆ సమస్యకు వారే పరిష్కారాన్ని కనుగొన్నారు. రాణిగారితోట విజయకృష్ణ థియేటర్ సమీపంలో ఫీడర్ రోడ్డుపై మూత్ర విసర్జన సమస్య అధికంగా ఉంది. జాతీయ రహదారి గోడ మూత్ర విసర్జన స్థలంగా ఆకతాయిలు మార్చడంతో అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్న వారికి చాలా ఇబ్బందిగా ఉంది. దీనికి తోడు వాహనాల పార్కింగ్ స్థలంగా కూడా మారింది. వీరిని ఎవరైన ప్రశ్నిస్తే దాడులకు కూడా దిగుతున్నారని స్థానికులు అంటున్నారు. అయితే ఈ సమస్యను ఎవరికి చెప్పుకున్నా ప్రయోజనం లేకపోవడంతో అక్కడ ఉండే ఒక వ్యాపారి చక్కని ఆలోచన చేశాడు. ఎక్కడైతే మూత్ర విసర్జన చేస్తున్నారో ఆ గోడకు అన్ని మతాలకు సంబంధించిన పలువురు దేవుళ్ల ఫొటోలతో ఉన్న బ్యానర్ ఏర్పాటు చేశాడు. దీంతో ఇక్కడ మూత్ర విసర్జన చేయడం లేదు. ఒక మంచి ఆలోచన తమ సమస్యకు తాత్కాలిక పరిష్కారాన్నే చూపిందని శాశ్వత పరిష్కారం నగరపాలక సంస్థ అధికారులు చూపాలని కోరుకుంటున్నారు. గతంలో ఇక్కడ మొక్కలు ఉండేవని, వాహనాల పార్కింగ్ వల్ల అవి కనుమరుగయ్యాయని అంటున్నారు. అధికారులు స్పందించి ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా ఉన్న వాల్ నుంచి సిమెంట్ గోడౌన్ వరకు మొక్కలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


దేవుళ్ల బొమ్మలతో ఉన్న గోడ

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్

రాయల్ సీసీపై ఆంధ్ర బ్లూస్ విజయం

విజయవాడ(స్పోర్ట్స్),ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో గురువారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో రాయల్ సీసీ, ఆంధ్రబ్లూస్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రబ్లూస్ జట్టు 49.5 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 218పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ సీసీ జట్టు 42.2 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 159పరుగులతో ఓటమి పాలైంది. న్యూ ఎవరెస్ట్, పటేల్ సీసీ జట్టు మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎవరెస్ట్ జట్టు 50ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 345పరుగులు భారీ స్కోర్ చేసింది. జట్టులో కెఎస్ఎన్.శ్రీనిచ్యా 98పరుగులు, సాయి అఖిల్ 86పరుగులు, జాశ్విన్ 63పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన పటేల్ సీసీ జట్టు 43.5 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 261పరుగులతో ఓటమి పాలైంది. న్యూ ఎవరెస్ట్ బౌలర్ మనోహర్ 4వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

శివరాత్రి ఉత్సవాల్లో విరిగిన ప్రభ



పెనమలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకొంది. ఉత్సవాల్లో పాల్గొన్న ఒక ప్రభ సగానికి విరిగి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. ఎన్టీఆర్ బస్‌స్టాప్ వద్ద ఉన్న మసీదు ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయకంపితులయ్యారు. మూడు విద్యుత్ స్థంభాలు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమయిన విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన క్రేన్లు తెచ్చి విరిగిన ప్రభను తీయించివేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. యనమలకుదురులో రెండు ప్రభల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకొంది. పోలీసులు రంగంలోకి దిగి వారిని లాఠీలతో చెదరగొట్టారు. కాసేపటికి వివాదం సద్దుమణిగింది.

వైభవంగా సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం

నందిగామ రూరల్: దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కల్యాణ్, ఈవో నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో దాములూరు శ్రీనివాసశర్మ, యనమదల రాజేష్ శర్మల వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన మంటపంలో కల్యాణాన్ని వేదోక్తంగా జరిపించారు. గురువారం స్వామికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు, పూజలు ఘనంగా నిర్వహించారు. సంగమేశ్వర స్వామి తిరునాళ్లలో ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కళావేదికపై నటరాజ నాట్య కళా మండలి వారితో జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	95,104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.485

నేటి నుంచి పూటీ లాగుడు పోటీలు

నందిగామ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం, శనివారాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పూటీ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం మూడు గంటల నుంచి జూనియర్, సీనియర్ గిత్తల విభాగం పోటీలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య పాల్గొంటారని తెలిపారు.



ఓటు వేసిన నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, బారులు తీరిన గ్రాడ్యుయేట్లు



జగ్గయ్యపేట పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



మైలవరంలో చంటి బిడ్డలతో...



తిరువూరులో ఓటేసి వస్తున్న దివ్యాంగురాలు

గ్రాడ్యుయేట్ల స్పందన భేష్

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన యువత
- చంటి బిడ్డలతో వచ్చిన మహిళలు
- ఓటేసిన దివ్యాంగులు

నందిగామ/చందర్లపాడు/వీరులపాడు/కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 27: నందిగామ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 8,958 ఓట్లకు 6226 ఓట్లు పోలయ్యాయి. 68.61 శాతం పోలి ంగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 6975 ఓట్లు ఉన్నాయి. వీటిలో 5,271 పోలయ్యాయి. 71.55 శాతం నమోదైంది. డివిజన్‌లో మొత్తం 69.93 శాతం నమోదైనట్లు ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో తన ఓటు వేశారు. ఏసీపీ ఏబీజీ తిలక్ ఆధ్వర్యంలో పోలీసులు ప టిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ లక్ష్మీశ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆర్డీవో కె.బాలకృష్ణకు ఆయన సూచించారు. పోలింగ్ అనంతరం బాక్సులు గుంటూరు కౌంటింగ్ కేంద్రాలకు చేరే వరకూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలంలో 70.37 శాతం ఓట్లు పోల్ అయినట్టు తహసీల్దార్ మనోహర్ తెలిపారు. 6 పోలింగ్ కేంద్రాల్లో 4,350 మంది ఓటర్లు ఉండగా 3061 మంది ఓటేశారని తెలిపారు. **పెనుగంచిప్రోలు:** మండలంలో 1,535 మంది ఓటర్లకు 1,203 మంది ఓటు వేశారని, 78.3 శాతం పోలింగ్ నమోదయినట్లు తహసీల్దార్ శాంతి లక్ష్మి తెలిపారు. పోలింగ్ సరళిని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు పరిశీలించారు. టీడీపీ నాయకులు చింతల వెంకట సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి:** మండలంలో మొత్తం 1,482 ఓట్లకు 1,013 ఓట్లు పోలయ్యాయని తహసీల్దార్ ప్రభుకుమార్ తెలిపారు.

ఆలపాటి విజయం తథ్యం

జగ్గయ్యపేట : ఓటింగ్ ఏక పక్షంగా సాగుతోందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం తెలిపారు. ఎమ్మెల్యే తాతయ్య, నియోజకవర్గ పరిశీలకుడు దొంతు చిన్నాతో కలిసి పోలింగ్ సరళిపై ఆయన సమీక్షించారు. భారీ మెజారిటీతో ఆలపాటి విజయం తథ్యమన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న నెట్టెం, తాతయ్య

జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఆయన సతీమణి స్వర్ణకుమారి, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆయన సోదరులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఓటేశారు.

మైలవరం నియోజకవర్గంలో..

జి.కొండూరు/మైలవరం/రెడ్డిగూడెం/ఇబ్రహీంపట్నం/విజయవాడ రూరల్/గొల్లపూడి : ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గంలో 13,490 మంది ఓటర్లు ఉండగా 9,291 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం, విజయవాడ రూరల్ మండలాలు కలుపుకొని 69 శాతం పోలింగ్ నమోదయింది. జి.కొండూరు మండలంలో 73.4 శాతం పోలింగ్ నమోదయిందని తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. 1,738 మంది ఓటర్లకు గాను 1,277 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. మైలవరం మండలంలో 64.64 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ దరియా తెలిపారు. 2,605 మంది ఓటర్లకు 1,684 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. రెడ్డిగూడెం మండలంలో 1,576 మంది ఓటర్లకు 1,135 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని 72.01 శాతం పోలింగ్ నమోదయిందని తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు. పోలింగ్ సరళిని నూజివీడు ఆర్డీవో మాధురి పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలంలో 67.81 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. 4,495 మంది ఓటర్లకు 3,034 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఐదు బూత్‌లతో కలిపి 70 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. 3,076 మంది ఓటర్లకు 2,161 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. బిడ్డల బంగారు భవిష్యత్ కోసం పలువురు తల్లులు మైలవరంలోని పోలింగ్ బూత్‌లకు తరలివచ్చి ఓట్లు వేశారు.



రెడ్డిగూడెంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి



ఓటు హక్కు వినియోగించుకున్న స్వామిదాసు, సుధారాణి

కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఓటింగ్: ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు : కూటమి ప్రభుత్వానికి మద్దతుగా పట్టభద్రులు ఓట్లు వేస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. జడ్పీహైస్కూల్‌లో ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. పట్టభద్రులు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఓటేస్తున్నారని అన్నారు.

తిరువూరు నియోజకవర్గంలో..

తిరువూరు : తిరువూరు నియోజకవర్గంలో 7692 ఓట్లకు 5,339 ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం 2,701 ఓట్లకు 1,862 ఓట్లు పోలయ్యాయి. 68.93 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఎన్నికల సరళిని పరిశీలించగా, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, పలువురు ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. **గంపలగూడెం:** గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1,862 మంది ఓటర్లకు 1315 మంది ఓటేశారు. 70.62శాతం నమోదు అయ్యింది. రెండు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో మాధురి, తహసీల్దార్ రాజకుమారి పరిశీలించారు. **విస్సన్నపేట:** మండలంలో 65.01 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి తెలిపారు. 1,921 మందికి గాను 1,249 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు. ఆర్డీవో కె.మాధురి, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, డేగా ప్రభాకర్, చిట్టాబత్తిన చిట్టిబాబులు ఓటింగ్ సరళిని పరిశీలించారు. **ఎ.కొండూరు :** ఎ.కొండూరు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు. మండలం మొత్తం 1,277 మంది ఓటర్లు ఉండగా 915 మంది ఓటేశారు.



వత్సవాయిలో బారులు తీరిన యువత



జగ్గయ్యపేటలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న నెట్టెం రఘురాం



విస్సన్నపేటలో ఎమ్మెల్యే కొలికపూడి..



ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో



నందిగామ అంకమ్మ ఆలయంలో జలబిందెలను ఊరేగిస్తున్న భక్తులు



జుజ్జూరు రథోత్సవంలో భక్తులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా ముక్త్యాల, తిరుమలగిరి, కె.అగ్రహారం గ్రామాలలోని శైవ క్షేత్రాలలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్త తరఫున ఆమె కుమార్తె కవితదత్ పాల్గొన్నారు. ఈవో సురేష్‌బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తిరుమలగిరి శివాలయంలో ఏసీ ప్రసాద్ కల్యాణాన్ని జరిపించారు.

సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం

నందిగామ రూరల్ : దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. లింగోద్భవ సమయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కల్యాణ్, ఈవో నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో దాములూరు శ్రీనివాసశర్మ, యనమదల రాజేష్ శర్మల వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. గురువారం స్వామికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు నిర్వహించారు. గోళ్లమూడిలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో లింగోద్భవ కాలంలో స్వామికి 108 కిలోల పుష్పాలతో పుష్పాభిషేకం చేశారు. పల్లగిరి గట్టుపై భవానీ శంకర స్వామి ఆలయంలో స్వామి కల్యాణ్యాన్ని ఘనంగా నిర్వహించారు. సంగమేశ్వరస్వామి తిరునాళ్లలో ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కళావేదికపై నటరాజ నాట్య కళా మండలి వారితో జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్ఫూర్తి కళా సంస్కృతి శాఖ సేవా సమితి అధ్యక్షురాలు మన్నే కళావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. కళాకారులను ఆమె సత్కరించారు. గింజుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరు హైమారావు, తోట నాగమల్లేశ్వరరావు, మన్నేపల్లి వినయ్, నేలవెల్లి సిద్ధార్థ పాల్గొన్నారు.



కళాకారులతో మన్నే కళావతి, తదితరులు

అంకమ్మ ఆలయంలో..

నందిగామ : కరెన్సీ నగర్‌లో అంకమ్మతల్లి ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం కనులపండుగగా జరిపించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకమ్మ ఆలయం వద్ద జలబిందెల కార్యక్రమం నిర్వహించారు.

పెనుగంచిప్రోలు శివాలయంలో..

పెనుగంచిప్రోలు : మునేటి తీరాన గంగా పార్వతి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద శివపార్వతుల కల్యాణం అయ్యప్ప సేవా సమితి, శంభులింగేశ్వరస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. వాసిరెడ్డి బెనర్జీ ఇంటి వద్ద నుంచి పసుపు కుంకుమలు, మంగళసూత్రాలు, తలంబ్రాలను మేళతాళాలతో దేవస్థానం వద్దకు తీసుకువచ్చి అర్చకుడు రేలంకి భాస్కరశర్మ ఆధ్వర్యంలో స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం పీటలపై వత్సవాయి మండలం కాకరవాయికి చెందిన దొడ్డా రంగారావు, శ్రుతి, పెనుగంచిప్రోలుకు చెందిన కర్ల ఆదిత్య, సాయి భవ్య దంపతులు కూర్చున్నారు.

మఠం శివాలయంలో..

జగ్గయ్యపేట : పాలేటి ఒడ్డున మఠం శివాలయంలో 54జంటలతో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తిలకించారు. పెద్ద శివాలయంలో పార్వతీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. పాతకూరగాయల మార్కెట్ సందులో సిద్ధి లింగేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణం భక్తబృంధం ఆధ్వర్యంలో నిర్వహించారు.

మల్లయ్యస్వామి కల్యాణం

విస్సన్నపేట: కొండపర్వలో భ్రమరాంబికా మల్లేశ్వర (మల్లయ్యస్వామి)స్వామి కల్యాణం బుధవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. కల్యాణాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిలకించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మట్టా వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

కనులపండువగా రథోత్సవం

వీరులపాడు : జుజ్జూరులో శివరాత్రి సందర్భంగా గిరి రామలింగేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. కోలాట బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జక్కంపూడి కాలనీలో తాగునీటి సమస్య రానీయొద్దు

● అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జక్కంపూడి కాలనీలో ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. జక్కంపూడి కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. పలు బ్లాక్‌లలో పారిశుధ్యం, మురుగునీటి పారుదల సమస్యలను పరిశీలించారు. తక్షణం పారిశుధ్యం మెరుగుపరచి, మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని, రోడ్ల అభివృద్ధి పరచాలని మొక్కలునాటి కాలనీలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందించాలని సూచించారు. కమ్యూనిటీ హాల్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. సీఎంహెచ్‌వో సురేష్‌బాబు, ఇంజనీర్లు సత్యకుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొల్లికుళ్ల బాధితులకు ఎమ్మెల్యే తాతయ్య పరామర్శ

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో బుధవారం మృతి చెందిన పెరుగు గురవయ్య, వాసుల మృతదేహాలకు బుధవారం రాత్రి కుటుంబసభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ తన్నీరు నాగేశ్వరరావులతో పాటు పలువురు తండ్రీకుమారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. గురవయ్య భార్య తిరుపతమ్మను వారు పరామర్శించారు.

శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయిస్తాం

విస్సన్నపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు, ఎస్సీలకు శ్మశానవాటికకు భూములు కేటాయించాలని ఆయా వర్గాలు దశాబ్ద కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నాయి. సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం పలు స్థలాలను పరిశీలించారు. త్వరలోనే ముస్లిం, ఎస్సీలకు శ్మశానం నిమిత్తం స్థలాలను కేటాయిస్తామని తెలిపారు.